క్లుప్తంగా

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి

భీమడోలు: గృహ యాజమానులు పన్నులు చెల్లించి పంచాయతీకి సహకరించాలని భీమడోలు గ్రామ పంచాయతీ కార్యదర్శి కేవీఎల్ తనూజ అన్నారు. భీమడోలు పంచాయతీ పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి, కుళాయి పన్నుల డిమాండ్ నోటీసులను గురువారం ఇంటింటికీ అందించి పన్నులు వసూలును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భీమడోలు పంచాయతీకి ఇంటి, కుళాయి పన్నుల ద్వారా కోటి రూపాయలు వరకు వసూలు కావాల్సి ఉంటుందన్నారు. డిమాండ్ నోటీసులు అందుకున్న 15 రోజుల్లో పన్నులను చెల్లించి పంచాయతీకి వెన్నుదన్నుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు: నిడమర్రు ఫీడర్ ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం 29వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. కావున బాదంపూడి రూరల్ ఫబుడర్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

డివైడర్‌పై మొక్కల ఏర్పాటు



డివైడర్ మధ్యలో మొక్కలు నాటుతున్న కార్మికులు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం పాలగూడెం జాతీయ రహదారిపై డివైడర్ల లో వివిధ రకాల పుష్పాల మొక్కలు ఏర్పాటు చేస్తున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారుల పర్యవేక్షణలో ఇప్పటివరకు పేరుకుపోయిన గడ్డి పిచ్చి మొక్కలను తొలగించి పూల మొక్కలను 22 మంది కార్మికులు ఏర్పాటు చేశారు.

గణపవరాన్ని ఏలూరులో కలపొద్దు



ఆందోళన చేస్తున్న ఏఐఎం సభ్యులు

గణపవరం: పశ్చిమగోదావరి జిల్లాలో కొనసాగుతున్న గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో కలపరాదని ఈమేరకు జరుగుతున్న ప్రయత్నాలు విరమించుకోవాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం గణపవరంలో ఆందోళన నిర్వహించారు. ప్రజల కోరిక మేరకు గతంలో ఏలూరు జిల్లా నుంచి విడదీసి పశ్చిమగోదావరి జిల్లాలో కలిపారని దీనిని కొనసాగించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏఐఎం జిల్లా ఇన్‌చార్జి బండి మధు, గణపవరం మండల కన్వీనర్ బళ్లారపు అశోక్ పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

గణపవరం: స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకులు ఇస్తున్న రుణాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని యుకో బ్యాంకు ఏజీఎం ప్రశాంత్‌కుమార్ అన్నారు. గురువారం గణపవరం మండలం మొయ్యేరులో అత్తిలి యుకోబ్యాంకు ఆధ్వర్యంలో మొయ్యేరులో ఏర్పాటు చేసిన మెగా రుణ మేళా సమావేశానికి సర్పంచ్ దుళ్ల కుటుంబరావు అధ్యక్షత వహించారు. మొయ్యేరు, కోమర్రు గ్రామాలకు చెందిన 16 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.3.05 కోట్ల రూపాయల రుణాలు పంపిణీ చేశారు. ఈమేరకు గ్రూపు లీడర్లకు బ్యాంకు చెక్కులు అందచేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కె.ప్రసాద్, మొయ్యేరు సొసైటీ అధ్యక్షుడు కానుమిల్లి వెంకటేశ్వరరావు, యుకో బ్యాంకు మేనేజర్ సుదీప్తమిశ్రా, బీఎం సురేష్, ఏపీఎం అమీరున్నీసా, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

లారీలపై కూలీలు ప్రయాణిస్తే చర్యలు

ఉంగుటూరు: మండలంలో పరిశ్రమల వద్ద నుంచి లారీలపై కూర్చుని ప్రయాణాలు సాగిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని తమసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్ హెచ్చరించారు. పరిశ్రమల యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఇటీవల దెందులూరు మండలం సింగవరం వద్ద జాతీయ రహదారిపై గరోడ హోటల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పైన కూర్చున్న కూలీలకు గాయాలవడంతో అప్రమత్తమయ్యారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ

లింగపాలెం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలైన వైఎస్సార్ సీపీ కార్యకర్త షేక్ ఈసుఫ్‌ను గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కంభం విజయరాజు, మాజీ సర్పంచ్ ఉప్పలపాటి వరప్రసాద్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మట్టా సురేష్‌బాబు తదితరులు ఈసుఫ్‌ను పరామర్శించారు.

లంబోదరునికి విశేష పూజలు

వాడవాడలా చవితి వేడుకలు ప్రారంభం



భీమడోలు: గణేషుని ఊరేగింపులో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు



ఉంగుటూరు: మాజీ ఎమ్మెల్యేకు స్వామి వారి జ్ఞాపికను అందజేస్తున్న ఉత్సవ కమిటీ



దెందులూరు: బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై శివాజీ



దెందులూరు: గణేశుడిని దర్శించుకుంటున్న భక్తులు

భీమడోలు: వినాయక చవితి పర్వదినాన్ని బుధవారం మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పందిళ్లు, ఆలయాల్లో కొలువైన లంబోదరుడిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని విశేష పూజలు చేశారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల గ్రామాలతో పాటు పల్లెల్లో బొజ్జ గణపయ్య వేడుకలు ఘనంగా ప్రారంభించారు. భీమడోలు గణపతి సెంటర్‌లోని శ్రీమన్మహా గణనాథుని ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. అంబర్‌పేట నుంచి మట్టి వినాయకునిని వెండి ఆభరణాలతో ట్రాక్టర్‌పై ఊరేగిస్తూ మేళతాళాల నడుమ ఆలయానికి తీసుకొచ్చారు. భీమడోలులోని రాష్ట్ర అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు గ్రామంలోని వినాయక స్వామి వార్లను దర్శించుకున్నారు. భీమడోలు గణపతి సెంటర్‌లోని గణనాథుడు రెండో రోజైన గురువారం సాంప్రదాయక ఎరుపువర్ణంలో అవతారంతో భక్తులకు దర్శనమిచ్చారు.

చవితి పందిళ్లను దర్శించిన మాజీ ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా నారాయణపురంలో వినాయక చవితి పందిళ్లను మాజీ ఎమ్మెల్యే , రాష్ట్ర వైఎస్సార్ సీపీ రాజకీయ సలహా సంఘం సభ్యులు పుప్పాల వాసు బాబు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు వాసుబాబుకు స్వాగతం పలికి సత్కరించారు. ఏడు దశాబ్దాలకు పైగా నారాయణపురంలో వర్తక సంఘం వారు నిర్వహిస్తున్న ఉత్సవాల్లో వినాయకుడిని దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ గౌరవ సభ్యులు అడపాశ్రీను వర్తక సంఘం సభ్యులు శాలువాతో సత్కరించారు. అనంతరం స్వామి వారి జ్ఞాపికను అందజేశారు. వాసుబాబుతో పాటు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడమంగరావు, ఎంపీటీసీ చాంబర్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు, పంచాయితీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు పుప్పాలగోపి, రాష్ట్ర బూత్‌కమిటి కార్యదర్శి ఎలిశెట్టిపాపారావు బాబ్జి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బీసీ విభాగం అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాసరావు, నాయకులు అరవెల్లి మహలక్ష్మి దానయ్య, అరుణ కుమర్, అడపా శ్రీనివాసరావు, బొబ్బిలి శ్రీను, బాలాజీ, సీపాని బాలు తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం

దెందులూరు: పండుగలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని ఎస్సై రాజమల్లు శివాజీ అన్నారు. గురువారం పోతునూరులో వినాయక చవితి ఉత్సవాలను సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శివాజీ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఉత్సవాల నిర్వాహకులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు ప్రమాదాలు జరగకుండా తమ వంతు బాధ్యతలు నిర్వహించాలన్నారు. గోపన్నపాలెంలో బాల గణేష్ యూత్ కన్వీనర్స్ మోదుగు యశ్వంత్ కుమార్, కర్రి శ్రీరామ్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఉండ్రాజవరంలో ఏర్పాటు చేసిన స్వామి వారి విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఎంపీటీసీ నరేష్ గ్రామ నాయకులు, సుధీర్ కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. పోతునూరు సాయిబాబా గుడి సమీపంలో ఏర్పాటు చేసిన స్వామి వారి విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు బత్రాజు చందు కుటుంబ సభ్యులు గ్రామస్తులు మహిళా భక్తులు పూజలు నిర్వహించారు. దెందులూరు, కొవ్వలి, సోమవరప్పాడు, గాలాయగూడెం, గంగన్నగూడెం, సీతంపేట, శ్రీరామవరం, పెరుగ్గూడెం, రామారావుగూడెం, మేదినరావుపాలెం, చల్ల చింతలపూడి గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

ఉత్సవాలు సంప్రదాయంగా నిర్వహించాలి

గణపవరం: పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని, సంప్రదాయబద్ధంగా వీటిని కొనసాగించాలని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు పుప్పాల వాసు బాబు అన్నారు. గురువారం ఆయన గణపవరంలోని దండు మారెమ్మ ఆలయం వద్ద మారెమ్మ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైస్సార్‌సిపి కన్వీనర్ దండురాము, వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర సూర్యబలిజ విభాగం అధ్యక్షుడు శెట్టిరాజా, ఎఎంసి మాజీ వైస్‌ఛైర్మన్ అబ్బాస్ రాజు, ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

పెదపాడు: మండలంలోని పెదపాడులో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పెదపాడు విఘ్నేశ్వరరస్వామి స్వామి ఆలయంలో స్వామి వారికి ఘనంగా పూజలు నిర్వహించారు. చవితి నవరాత్రి ఉత్సవాలను పురష్కరించుకుని స్వామికి ప్రత్యేక అలంకరణలు చేశారు. గ్రండిచెరువు గట్టు సెంటర్‌లో ఏర్పాటు చేసిన 10 అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అర్చకుడు శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేసారు. కార్యక్రమంలో గ్రామస్థులు పెద్దింటి రంగారావు, జాగాన శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



గుండుగొలనులో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా

భీమడోలు: యూరియా పంపిణీలో ఎటువంటి అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా అన్నారు. యూరియా పంపిణీలో రైతులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత సొసైటీ, డీలర్లదేనని ఆదేశించారు. గుండుగొలనులో శ్రీలలితాంబిక మెన్యూర్ డిపో, స్వర్ణ ఎరువుల దుకాణాలను ఆయన గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదన్నారు. కృత్రిమంగా యూరియా కొరత సృష్టిస్తే సహించేది లేదన్నారు. మండల వ్యాప్తంగా ప్రైవేటు డీలర్ల, సొసైటీల వద్ద 72 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో ఏవో ఉషారాణి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా రైతులకు మాత్రమే ఇవ్వాలి

ఉంగుటూరు: యూరియా రైతులకు మాత్రమే ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా అన్నారు. గురువారం ఉంగుటూరులో గ్రోమార్ ఎరువుల దుకాణాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయేతర అవసరాలకు ఇవ్వొద్దని స్పష్టం చేశారు. అమ్మకాలు ప్రతి రోజూ ఈపాస్‌లో నమోదు చేసి మాత్రమే రైతులకు అమ్మాలని సూచించారు. యూరియా సరఫరా నిల్వ, అమ్మకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్ తదితర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడి బస్సు లేదు.. ఆర్టీసీ రాదు

వంద మంది విద్యార్థుల ఇక్కట్లు



బస్సులు రాక వర్షంలో తడుస్తూ ఎదురుచూస్తున్న విద్యార్థులు

దెందులూరు: బడి బస్సు లేదు, ఆర్టీసీ రావడం లేదు. దెందులూరు నుంచి జాతీయ రహదారిపై చెక్‌పోస్టు వరకు రెండు కిలోమీటర్లు ప్రతిరోజూ ఉదయం సాయంత్రం నడిచి వెళ్లి వస్తున్నామని దాదాపు 100 మంది విద్యార్థులు కన్నీటి పర్యంతమవుతున్నారు. నియోజకవర్గ ముఖ్య కేంద్రమైన దెందులూరుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యార్థుల సౌకర్యార్థం బడి బస్సు ఏర్పాటు చేశారు. విద్యార్థులందరికీ ఈ బస్సు సర్వీస్ ద్వారా ఎంతో ఉపయోగంగా ఉండేది. ప్రస్తుతం బడి బస్సు లేదు. దీనికి తోడు రెండు నెలలుగా ఆర్టీసీ బస్సు దెందులూరుకు రావడం లేదు. దీంతో ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఐటిఐ, ఇంజనీరింగ్ చదువుకునే విద్యార్థులు నరకం చూస్తున్నామని ఉదయం దెందులూరు నుంచి జాతీయ రహదారిపై దాదాపు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వస్తున్నామని మళ్లీ సాయంత్రం నడక తప్పడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దాదాపు ప్రతిరోజూ ఉదయం గాని సాయంత్రం గాని వర్షం వస్తుందని నడకే ఇబ్బందిగా ఉందంటే మళ్లీ వర్షంలో తడుచుకుంటూ నడవడం ఎంత ఇబ్బంది ఉందో ఎవరికి తెలుస్తుందని తాము ఎవరికి చెప్పుకోవాలో తమ సమస్య ఎవరు పరిష్కరిస్తారో అర్థం కాలేదని అంటున్నారు. గతంలో బడి బస్సు ఉన్నప్పుడు తమకే కష్టం తెలియలేదన్నారు. ఇప్పుడు బడి బస్సు లేక ఆర్టీసీ బస్సు రాక దాదాపు 100 మంది విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు ఎవరూ పట్టించుకోవట్లేదని విద్యార్థులు తల్లిదండ్రులు బంధువులు స్నేహితులు శ్రేయోభిలాషులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు గ్రామంలోకి వచ్చి సమస్య తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని దెందులూరు గ్రామానికి చెందిన దాదాపు 100 మంది విద్యార్థులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

కోమటి లంకకు కన్నీటి కష్టాలు


20 రోజులుగా పడవలోనే ప్రయాణం



పడవలో ప్రయాణిస్తున్న ప్రయాణీకులు

దెందులూరు: కోమటిలంకకు కన్నీటి కష్టాలు వీడటం లేదు. సురక్షితమైన రహదారి మార్గం లేకపోవడం వర్షపు నీరు ప్రమాదకర స్థితిలో ప్రవహించడం కోమటిలంక గ్రామస్తులకు శాపంగా మారింది. దీనికి తోడు మరో మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించడంతో గ్రామస్తుల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. వృద్ధులు, వికలాంగులు, ఇతర అనారోగ్యంతో వైద్యశాలలకు వెళ్లే వారికి నరకప్రాయంగా తయారైంది. వీరు కాకుండా విద్యార్థులు, ఉదోద్యగస్తులు, వ్యాపారులు, కూలీలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఉన్న ఒక రేకుల పడవని నమ్ముకున్నారు. ఆ పడవలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఇన్ని కష్టాలు పడుతున్న కోమటి లంక గ్రామం జిల్లా కేంద్రమైన ఏలూరుకు కూత వేటు దూరంలోనే ఉండటం గమనార్హం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏలూరు రూరల్ తహసీల్దార్ జి.విజయకుమార్‌రాజు కోమటిలంకను రెండు రోజులకు ఒకసారి వెళ్లి పడవ ప్రమాదం జరగకుండా ఎక్కువమంది ప్రయాణం చేయకుండా గ్రామంలోనూ, వెలుపల ప్రభుత్వ ఉద్యోగులకు విధులు కేటాయిస్తూ పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని కోమటిలంకకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిండాముంచిన వర్షం



దెందులూరు: నీటమునిగిన వరినాట్లు



భీమడోలు: జలమయమైన రహదారి

దెందులూరు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సోమవరప్పాడు వ్యాసకాని నది సమీపంలో వరి నాట్లు ముంపుకు గురయ్యాయి. పొలాల్లో ఉన్న వర్షపు నీరు పోవడానికి నాలుగైదు రోజులు పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో మూడు రోజులు పాటు భారీ వర్షాలు ప్రకటన వాతావరణ శాఖ చెప్పటంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొని ఉందని బాధిత రైతులు వాపోతున్నారు.

దంచికొట్టిన వర్షం

భీమడోలు: అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి వర్షం దంచి కొట్టింది. మునుపెన్నడూ లేని విధంగా భారీ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హెచ్చరికలతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా 78.80 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రధాన రోడ్లపై నీరు తాండవించడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరు ప్రధాన రోడ్లపై పొంగి ప్రవహిస్తుంది. జన జీవనం అతలాకుతమైంది. భీమడోలు జంక్షన్‌లోని జాతీయ, రాష్ట్రీయ రహదారులపై వర్షం నీరు పొంగి ప్రవహించడంతో వాహనాలు రాకపోకలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షంతో రైతులు ఉలిక్కి పడ్డారు. ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న రైతాంగానికి ఈ వర్షం కలవరాన్ని కలిగించింది. మరో నాలుగు రోజుల పాటు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి ముంపు నీరంతా కిందకు పారుతూ పల్లపు ప్రాంతాలకు చేరింది. దీనితో పొలసానిపల్లిలోని బీసీ కాలనీ, ఇతర పల్లపు ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరంతా పొలసానిపల్లి టూ ద్వారకాతిరుమల రోడ్డుపై తాండవిస్తుంది. కనీసం వర్షపు నీరు కిందకు వెళ్లేలా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు, వాహనదారులు యాతన పడుతున్నారు.

ఎడతెరిపి లేని వర్షం

ఉంగుటూరు: బంగాళా కాతంలో ఏర్పాడిన అల్పపీడనం ఫలితంగా మండలంలో ఏకదాటిగా మూడురోజులుగా వర్షం కురుస్తానే ఉంది. గురువారం ఉదయం ఒక్కరోజు 58 మిల్లి మీటర్లు వర్షం కురిసింది. మూడురోజులుగా కురిసిన చలిగాలి వర్షాలతో జనజీవనం స్తంబించింది. లోతట్టు వీదుల్లోకి నీరుచేరింది. లోతట్టు పొలాలు తిరిగి నీరుచేరింది. ఇప్పటికే మండలంలో మునిగిపోయి పాడైపోయిన వందలాది ఎకరాలకు రైతులకు తిరిగి ముసురుగా కురుస్తున్న వర్షాలు గోరుచుట్టుపై రోకలిపోటు అన్న చందంగా రైతుల పరిస్థితి తయారైంది. రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది పంట చేతికి అందదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..



ప్రమాదకరంగా మారిన పెద్ద గొయ్యి

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం ఆశ్రమం నుంచి దెందులూరు వెళ్లే సర్వీస్ రోడ్డులో పెద్ద గొయ్యి ఏర్పడింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఏవైనా వాహనాలు పడతాయేమోనని చెట్టు కొమ్మలు ఆ గొయ్యిలో పెట్టారు. ప్రతిరోజూ దాదాపు 1000 పైగా బస్సులు, లారీలు, కారులు, ఆటోలు ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పగలు రాత్రి వేళల్లో పొరపాటున ఏ వాహనం ఆ గోతిలో పడినా నష్టం తప్పదు. ఆర్ అండ్‌బీ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు పెద్ద గొయ్యిని పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో పెద్ద నష్టం జరిగే ప్రమాదం పొంచి ఉందని రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ అమర వీరులకు ఘన నివాళి



భీమడోలు: మృతులకు నివాళులర్పిస్తున్న జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు లింగరాజు



గణపవరం: విద్యుత్ అమర వీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

భీమడోలు: 25 ఏళ్ల క్రితం టీడీపీ తెచ్చిన విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాడి ఆసువులు బాసిన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి త్యాగాలు మరవలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు సివిల్ సప్‌లై గోడౌన్ల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఆసువులు బాసిన వారి చిత్ర పటాల వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నాయకులు కె.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్.లింగరాజు మాట్లాడుతూ ఆనాడు ప్రపంచ బ్యాంకు ఆదేశిత విధానాలకు టీడీపీ ప్రభుత్వం అమలు చేసి విద్యుత్ రంగాన్ని ముక్కలుగా చేసి ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాలను కమ్యూనిస్టులు, వామపక్షాలన్నీ ఐక్యంగా ఎదుర్కొన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అదానీ మీటర్లను ప్రజలు ఐక్యంగా తిరస్కరించాలని కోరారు. కార్యక్రమంలో త్రిమూర్తులు, దుర్గారావు, శ్రీనివాసరావు, హమాలీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

గణపవరంలో..

గణపవరం: విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా నిర్వహించిన ఆందోళనలో అశువులు బాసిన అమరవీరుల త్యాగాన్ని మరువలేమని మండల సీపీఎం కార్యదర్శి ఎం.పెంటారావు అన్నారు. గురువారం గణపవరం సీపీఎం కార్యాలయంలో అమర వీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సభ్యులు చిన్నం నాగేశ్వరరావు, కట్టూరి ప్రసాద్, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక భూసేకరణకు కృషి



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌డీఓ

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో చేస్తున్న భూసేకరణ పారదర్శకంగా జరిగేలా కృషి చేస్తున్నామని జంగారెడ్డిగూడెం ఆర్‌డీఓ ఎంవీ రమణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో భూసేకరణపై వస్తున్న అభ్యంతరాలపై ఆమె వివరాలు సేకరించేందుకు వచ్చారు. అయితే ఈ కార్యక్రమానికి సమస్య పరిష్కరించే దిశగా తాను కృషి చేయాలని చూస్తున్నప్పటికీ ఇరు వర్గాలు హాజరవ్వడం లేదని చెప్పారు. భూసేకరణకు సంబంధించి అన్ని రికార్డులను పరిశీలించిన తరువాతే భూములను తీసుకుంటామని చెప్పారు. జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండల పరిధిలో సుమారు 5 వేల ఎకరాల భూమి నిర్వాసితులకు సేకరించనున్నట్లు చెప్పారు. అయితే ఇప్పటి వరకూ బుట్టాయగూడెం మండలంలో 200 ఎకరాలు మాత్రమే సేకరించామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ చలపతిరావు, ఎస్సై దుర్గా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.